కథ

# పూజ చేసి చూడు

కె.ఎస్. పద్మనాభరావు

వేదమంత్రోచ్చారణతో, హోమాలతో ఇల్లంతా సందడిగా ఉంది. నాలుగు గంటలకి మొత్తం గృహప్రవేశ తతంగం ముగిసింది. పొగల ధాటికి మా ఆవిడ విసుక్కోవడం ఎక్కువయింది "చెపితే వినరు. మీ చాదస్తం మీదే, ఈ హంగంతా అవసరమాని..." అంటూ. మా అమ్మా, నాన్నా చెప్పిన ప్రకారం తూచా తప్పకుండా హోమాలు చేయించానన్న కోపం ఆవిడది.

వాళ్లు వెళ్లే టైమయింది. "అబ్బీ, కొత్త ఇల్లు. జాగ్రత్తగా చూసుకో. ఇంట్లో రోజూ పూజా, పునస్కారం జరిగేట్లా చూడు. అడ్డమైన వాళ్లని రానిచ్చి అంటమంగళం చేయించేయకు." అంది అమ్మ మా ఆవిడ బాబ్డ్ హెయిర్ స్నేహితురాళ్ల కేసి కోరగా చూస్తూ.

అమ్మ మాట కంటే మా ఆవిడ కడుపులో కుతకుత శబ్దం స్పష్టంగా వినిపించింది. 'రోజూ పూజ చేయాలట, ఇంకేం పని లేనట్టు. మరి ఉద్యోగానికి ఎలా వెళతాననుకున్నారో..." అంటున్నాయి ఆ శబ్దాలు. ఎక్కడ తిరుగు సమాధానం చెబుతోందనని హడిలి ఛస్తూండగానే ఎవరో పిలిచారు తనని. "హమ్మయ్య" అనుకుని, "అలాగే అమ్మా, నువ్వేం ఇదవ్వకు. అందరు దేవుళ్లకూ రోజుకొకరు చొప్పున పూజ చేస్తానుగా... అదే చేయిస్తానుగా..." అన్నాను.

"నాజమ్మ, పెళ్లానికి చెప్పుకోలేడు." అంటూ సుతారంగా మొట్టి వెళ్లిపోయింది అమ్మ. వాళ్లని రైలెక్కించి వచ్చేసరికి రాత్రి పది!

మర్నాడు తెల్లవారుఝామున నాలుగున్నరకు గణగణమని అలారం మోగింది. ఉలిక్కిపడి లేచాను. నా కంటే ముందే లేచింది సుధ. "అలారం ఎవరు పెట్టారు? నిన్నంతా కూచుని, కూచుని నడుం పీక్కుపోయింది. రాత్రి మీరు తిరిగి, తిరిగి వచ్చేసరికి పన్నెండు. ఒళ్లు నెప్పులతో నిద్రపట్టి చావలేదు. ఇంత పొద్దున్న ఏం చేద్దామని అలారం పెట్టారు?" అంటూ గయ్ మంది.


"అబ్బే. ఏమీ లేదు. ఇవ్వాళ సోమవారం కదా. శివుడికి రుద్రాభిషేకం చేయిద్దామని..: " నసిగాను.

"ఛాల్లే సంబడం. ఆ ముసలాయన ఇల్లు కట్టడానికి సాయం చేయకపోయినా, చాదస్తం ఒకటి అంటగట్టి వెళ్లాడు. ఆయన వెళుతూ, వెళుతూ హితోపదేశం చేయడం. మీరు దాన్ని అమలు చేయడం." అంది విసురుగా.

"బావుంది, మనిషన్నాక కాస్త భక్తి ఉండద్దూ..." అన్నాను కాస్త గట్టిగానే.

"భక్తి ఉండద్దని ఎవరన్నారు? మీలాగ తెల్లవారుఝామున లేచి గణగణ గంటకొట్టి, అందర్నీ నిద్రలేపితేనే భక్తా? అది మనస్సులో ఉంటే చాలదా?" వాదనకు దిగింది.

ఇది మా ఇద్దరికీ ఉన్న పాత గొడవే. ఇద్దరం ఉద్యోగాలు చేస్తున్నప్పుడు పూజా, పునస్కారం



లోకం చూసిన మనిషిలా ఉన్నాడు. క్షణంలో విషయం గ్రహించేడు. "ఇంట్లో ఆడవాళ్లు సహకరించందే ఏ పూజా సాగదండి." అన్నాడు నిట్టూర్చి. కాస్త ఆగి, "మీలాటి వాళ్ల కోసమే ఒక బహుళార్థ ప్రణాళిక పెట్టామండి. సూక్ష్మంలో మోక్షం. మీరు రోజూ ఒక్కో దేవుడికి అష్టోత్తర పూజ చేయిస్తే అరగంట పడుతుంది.



కుదరదన్న వాదన ఆవిడది. కాస్తైనా లేకపోతే ఎలా? అన్న వాదన నాది.

నా మొహం మాడిందని గుర్తించిందేమో, కాస్త అనునయంగా "అయినా ఇంత చలిలో లేస్తే ఆరోగ్యం పాడవదూ? మీకసలే ఆఫీసులో హెవీ వర్కు. పదిరోజులుగా ఫంక్షన్ హడావుడితో ఒళ్లు పులిసి ఉన్నారు. కావాలంటే ఏడింటికి లేపుతాను. స్నానం చేసి ఓ నమస్కారం పెట్టుకోండి చాలు." అంటూ మీద చెయ్యి వేసింది.

కొత్త ఇంట్లో పూజకి మొదటి రోజే ఇలా వాయిదా వేయడం తప్పనిపించింది. "నిన్నేం ఇబ్బంది పెట్టనులే! గంట నెమ్మదిగా తలుపులు మూసి కొట్టుకుంటాను. సరేనా.." అంటూ చెయ్యి విదిలించుకుని మంచం దిగబోయాను. రొమాంటిక్ సినిమాలు చూసిన అనుభవంతో "అబ్బ, ఎంత మార్పు, రక్తి నుండి ఏకంగా భక్తిలోకి గెంతేసారే!" అని నవ్వుతూ నాకు కాలు అడ్డుపెట్టిందామె.

కానీ ఆమె అంచనా తప్పి, ఆమె మీద పడే బదులు తూలి గోడకు కొట్టుకోవడంతో నుదురు బొప్పి కట్టింది.

ఆవిడ రొమాంటిక్ మూడ్‌లోంచి బయటపడలేదులాగుంది "ఈ మూడోనేత్రంతో మీరే అచ్చు ఈశ్వరుడిలా ఉన్నారండి. ఇక అభిషేకం ఒక్కటే తరువాయి." అంది అల్లరిగా.

"ఇదేం అల్లరి? పాపం తెలుసా!" అన్నాను ఉక్రోషంగా.

"అలా గంతులేస్తే పైన ఫాన్ నెత్తికి తగిలి జటాజూటం కూడా పైకి లేస్తుంది. జాగ్రత్త. పతి పరమేశ్వరుడంటే ఇదే కాబోలనుకుని నేను మీకు పూజ చేయాల్సి వస్తుంది." అంది కవ్వింపుగా.

ఈ అల్లరికి తట్టుకోవడం మహా, మహా మునులకే కష్టం. "రేపట్నించి చేద్దాం. పూజ" అనుకుంటూ వాలిపోయాను ఆమెపై!

మరుసటిరోజు మాత్రం తగిన జాగ్రత్తలు తీసుకున్నాను. లేవగానే తన కేసి చూడకుండా, ఇంట్లో పూజ కార్యక్రమం పెట్టుకోకుండా ఎకాయెకి ఇంటికి పక్కనే ఉన్న గుడికి వెళ్లిపోయాను. ఇంటికన్నా గుడి పదిలం అంటే ఇదే కాబోలు! కొత్త బిచ్చగాడిని కదా, గుడికి ఫుల్ రౌండు కొట్టాను పది సార్లు.

దేవుళ్లు చాలా మందే కొలువుతీరారు

ఈశ్వరుడు,
వెంకటరమణమూర్తి,
దుర్గాదేవి,
ఆంజనేయస్వామి.
విఘ్నేశ్వరుడు ముఖ్యమైన వాళ్లెవరినీ వదిలిపెట్టలేదు గుడిని నడిపించే పూజారి కుటుంబం. దేవుళ్ల కాంప్లెక్స్ అంటే నయమేమో! చోటు చాలలేదేమో, ఇరుగ్గా ఒకళ్ల నెత్తిమీద మరొకళ్లని ఎక్కించారు.

పూజల రేట్ల పట్టిక చూస్తుంటే పలకరించాడు పెద్ద పూజారి. తక్కిన పూజార్లందరూ ఆయన కొడుకులూ, తమ్ముళ్లూ, అల్లుళ్లే. "పూజల రేట్ల కోసం బోర్డు చూడడం ఎందుకు? నాతో మాట్లాడితే ఏదో చవగ్గా తేలే మార్గం చెప్పకపోతానూ?" అన్నాడు సాగదీస్తూ.

"అదేనండి. అందరు దేవుళ్లకూ కలిపి ఇంట్లో సింహాసనం ఏర్పాటు చేసాను. కానీ ఇంట్లో కుదరడం లేదు." అన్నాను దిగాలుగా.

లోకం చూసిన మనిషిలా ఉన్నాడు, క్షణంలో విషయం గ్రహించేడు. "ఇంట్లో ఆడవాళ్లు సహకరించందే ఏ పూజా సాగదండి." అన్నాడు నిట్టూర్చి. కాస్త ఆగి, "మీలాటి వాళ్ల కోసమే ఒక బహుళార్థ ప్రణాళిక పెట్టామండి. సూక్ష్మంలో మోక్షం. మీరు రోజూ ఒక్కో దేవుడికి అష్టోత్తర పూజ చేయిస్తే అరగంట పడుతుంది. మీ ఆవిడకి అనుమానం వస్తుంది. కాబట్టి పదిరోజులది కలిపి ఒకే రోజు సహస్రనామార్చన చేయించేద్దాం. మూడు గంటల్లో తెమిల్చేద్దాం. మీ ఆవిడ ఏ ఫంక్షన్‌కో పొద్దున్న వెళ్లినప్పుడు చెప్పండి. ఆవేళ లాగించేద్దాం. వెయ్యి నూటపదార్లు ఖర్చవుతుంది. మైకులో మీ పేరు ఖంగుమనిపిస్తాం."

"వద్దు మహాప్రభో, ఆ ఖంగు మా ఇంటిపక్కవాళ్లకు వినిపించి ఆవిడకు చెప్తారంటే మా ఆవిడ మండిపడుతుంది. నా పరువు బజారుకెక్కించారా? నేను ఇంట్లో వద్దన్నానని గుళ్లో చెప్తారా? అంటూ విరుచుకుపడుతుంది."

"పోనీ మీరు వద్దంటే అలాగే మానేద్దాం. మీరు ఏడుగురు ప్రధాన దేవుళ్లకి పూజ చేయిస్తున్నారంటే అలాటి ఏడురోజులు చూసుకోవాలి. మరి వీలుపడుతుందంటారా?"

"కష్టమేననుకోండి. పైగా ఫంక్షన్‌కి వెళ్లాలంటే మా ఆవిడ నన్నూ తోడు రమ్మంటుంది. ఆవిణ్ణి ఒక్కదాన్ని పంపించి నేను గుడికి రావడం కష్టం."

"పోనీ ఎలాగోలా చెప్పి పంపిద్దామనుకున్నా, ఆర్నెల్లదాకా ఫంక్షన్‌లు వచ్చే సావకాశం లేదండి. ఎదురున్నదల్లా శూన్యమాసం. ముహూర్తాలే లేవు. బర్త్‌డే పార్టీలాటివి ఉన్నా అవి సాయంత్రమే ఉంటాయి."


"మరెలా?"

"పోనీ మీరు ఒక్కరోజు ఎలాగోలా మానేజ్ చేయండి. ఏడుగురికి కలిపి సహస్రనామార్చన ఆవాళే చేసేద్దాం."

"అంటే కొంత మంది దేవుళ్లకు మిట్టమధ్యాహ్నం వేళ..."

"...మీరు దాని గురించి వర్రీ కాకండి. గుడి మనది. పూజార్లు మావాళ్లు. దేవుళ్లూ మనవాళ్లే. అర్థరాత్రే సుప్రభాతం పాడి లేపి కూచోబెడదాం. టోకు బేరం కాబట్టి దేవుడికి ఎనిమిది వందల చొప్పున ఇవ్వండి. చాలు."

....మిగతా 63వ పేజీలో



....53వ పేజీ తరువాయి

అన్నిటికంటే కన్సెషన్ నన్ను ఆకర్షించింది. ఆ పైన అయన ఏవేవో చెప్పాడు ఏడు జతల పంచెలు తెచ్చుకోవాలిట. ఏమీ తినకూడదు గానీ కాఫీ తెచ్చుకోవచ్చుట. ఫ్లాస్కులో తెచ్చుకుంటే ఆరారగా తాగచ్చు. పూజారికి ఇవ్వవచ్చుట కూడా. అన్నీ చెప్పి, నా చేత సరేననిపించి వచ్చేస్తూ ఉంటే "అయ్యా ఇవాళ ఏకాదశి..." అంటూ చెయ్యి చాపాడు. ఏం చేస్తాను? పది రూపాయలు చేత బెట్టి కదిలాను.

మా ఆవిడ ఊళ్లో లేకుండా పూర్తి రోజు నా స్వంతమయ్యే రోజు పదిహేను రోజులకు గాని రాలేదు. ఆవాళ మా మావగారు ఫోన్ చేయగానే సుధకు చెప్పాను హుషారుగా, " ఇదుగో, మీ చెల్లెలికి పెళ్లి చూపులట, రేపే. పాపకు కూడా సరదాగా ఉంటుంది. ఇవాళే బయలుదేరుతావా?"

"పెళ్లి కాదుగా, చూపులేగా. నేను వెళితే మీకు వంటా అదీ..."

"నేను చూసుకుంటానులే. మీ చెల్లెలి సౌభాగ్యం కంటే ముఖ్యమా?"

"అదేం భాష? నన్ను ఊరుకి పంపడానికి అంత ఆత్రంగా ఉన్నారేమిటి? ఏమిటి కథ?" అడిగేసింది ఆడ షెర్లాక్‌హోమ్స్.

"ఛ,ఛ. నీ కన్నీ అనుమానాలే! పాపం పెద్దవాళ్లు స్వయంగా అన్ని ఏర్పాట్లు చూసుకోలేక నిన్ను రమ్మన్నారు. పోనీ కదాని నేను సరేనంటే... నువ్వు ఇలా..."

"అవునవును. వాళ్లు ఏం చూసుకోగలరు? మీరు రండి, సహాయంగా ఉంటుంది. రేపు ఆదివారమే కాబట్టి సెలవు కూడా పెట్టనక్కరలేదు."

కథ అడ్డం తిరిగింది కానీ ఛట్టున గుర్తుకొచ్చింది. "భలేదానివి. కొత్త ఇల్లు. కాంపౌండు వాలు కూడా పూర్తవలేదు. దొంగలభయం వేరే. నువ్వెళ్లి రా."

అయిష్టంగానే కదిలింది సుధ ఆ సాయంత్రం మా పాపతో సహా. బస్సెక్కబోతూ కూడా అనుమానం వెలిబుచ్చి మరీ వెళ్లింది "మీరు పేకాట కెళతారేమో! రేపు సాయంత్రానికి తిరిగొచ్చేస్తా. ఇంటి తాళంచెవులు కూడా పట్టుకెళ్లటం లేదు మరి."

"పేకాట మానేసి చాలా ఏళ్లయిందిగా. నేను ఇంట్లోనే ఉంటాను. క్రికెట్‌మాచ్ వస్తుందిగా టీవీలో." నమ్మబలికా.

మర్నాడు పొద్దున్న ఐదు గంటలకల్లా గుడిలో నేను హాజరు. ముందురోజు సాయంత్రమే బుక్ చేసేసుకున్నాను కాబట్టి పూజారి కుటుంబం రెడీగా ఉంది. పెద్దపూజారి శివుడికి సహస్రనామార్చన, రుద్రాభిషేకం మొదలెడుతూ అడిగేడు "పూజ సామగ్రి ఎక్కడ పెట్టారు?"

నాలుక కరుచుకున్నాను. వెధవ హడావుడి. ఆత్రం. ఆయన గ్రహించేడు.

"ఏభై రూపాయలు ఇవ్వండి. నేను సిద్ధం చేస్తాను."

గంటన్నర తర్వాత వదిలిపెట్టాడు. "సంభావనో" అన్నాడు చివర్లో. పదకొండు రూపాయలు చేతిలో పెట్టాను. ఈసడింపుగా చూసి, "నా దక్షిణ కనీసం నూటపదహార్లు."

తప్పుతుందా? ఇచ్చాను. రొంటిన దోపుకుంటే, "వెళ్లండి. శనికి సహస్రనామార్చన, తైలాభిషేకం."

"తైలాభిషేకం లిస్టులో లేదుగా..."


"లేకపోయినా చేయించాల్సిందే. లేకపోతే మా అల్లుడికి కోపం వస్తుంది. అయినా జస్ట్ వందరూపాయలు."

అల్లుడికి గీర ఎక్కువలా ఉంది. "పూజసామానుకి డబ్బులిలా ఇచ్చి, స్నానం చేసి రండి." అన్నాడు.

"స్నానం చేసే వచ్చానండి."

"లేదు, లేదు. ఎక్కడికక్కడ చేయాల్సిందే. ఏ గుడి రూల్సు దానివే. దేవుళ్లలో పోటీ వస్తే ఆ పాపం మాకు చుట్టుకుంటుంది." అంటూ గుడి చెరువులో తోసినంత పని చేశాడు.

ఆ తరువాత సాయంత్రం లోపున నేను పడ్డ బాధ వర్ణించ తరం కాదు. అడుగడుగునా స్నానాలు, గుడిగుడికి ప్రదక్షిణాలు, వచ్చీరాని మంత్రాలతో హడలగొట్టే పూజారి, పులిహోర ఆరగించి బ్రేవ్ మని త్రేన్పుతూ వచ్చిన పూజారి, పీచుమిఠాయి నోటితో అస్తమానూ తిట్టే పూజారి, చిల్లర చూస్తే చీదరించుకుని నోట్లు మాత్రమే పెట్టాలనే పూజారి, దక్షిణ ముందే ఇవ్వాలని పట్టుబట్టే పూజారి, నన్ను పూజా మధ్యలో కూచోబెట్టి బయట షికార్లు కొట్టి వచ్చే పూజారి ఇలా ఒకరి తర్వాత ఒకరు నన్ను తలో రెండుగంటలు చావగొట్టి సాయంత్రానికి దుర్గ పూజ దగ్గరకొచ్చేసరికి ఆవిడ చేత మర్దించబడిన మహిషాసురుడిలా అయిపోయేను.




నా శరీరం నేనే గుర్తుపట్టలేనట్లు బైరాగి శరీరంలా అయిపోయింది. చెరువు పాచి అంతా నా ఒంటి మీదే పేరుకుపోయింది. దానిమీద కుంకం, విబూది, పువ్వుల అద్దకం ఒకటి. ఒంట్లో ఓపికతోబాటు జేబు కూడా ఖాళీ కూడా కావడంతో ఆఖరి పూజారి దుర్గ పూజ చేయననేసాడు.

టైము చూస్తే అయిదు. సుధ వచ్చేసి ఉంటుంది. అనుమానం పెనుభూతంగా మారకముందే ఇల్లు చేరాలి. కంగారుగా వెళ్లబోయి అరటి తొక్క మీద కాలు వేసా. కళ్లు తిరిగాయి. మోకాలు చిప్ప బద్దలయింది. కుంటుకుంటూ ఇంటి కెళ్లేసరికి సుధ భద్రకాళి అవతారంలో ఉంది. పాప నా అవతారం చూస్తూనే కెవ్వున కేక వేసింది.

సుధ నా మోకాలి దగ్గర కారుతున్న రక్తాన్ని పట్టించుకోలేదు. నా జేబులోంచి తాళాలు విసురుగా లాక్కొని తలుపు తీసింది. తాళాలతో బాటు చేతిలో కొచ్చిన పూజరసీదులను చూసి ఉలిక్కిపడింది. "నా పరువు తీయందే మీకు నిద్ర పట్టలేదన్నమాట." అంది అగ్గిమీద గుగ్గిలం అవుతూ.

"అబ్బే, పూర్తవలేదు. ఇంకా కనకదుర్గ మిగిలిపోయింది." అన్నాను ఏం మాట్లాడుతున్నానో ఒళ్లెరక్కుండా.

వేరే కనకదుర్గెందుకు? నేనున్నానుగా" అంటూ రౌద్రాకారం ఎత్తింది. దెబ్బకి నాకు స్పృహతప్పింది.

000

ఏవేవో కలలు. దేవుళ్లందరూ ఒకళ్ల నెత్తి మీద మరొకరు ఎక్కి ఉన్నారు. అందర్నీ పెద్ద పూజారి తోలుతున్నాడు. దేవుళ్ల కాళ్ల కింద నాలాంటి వాళ్లం నలుగుతున్నాం. దేవుడి రథం నా కాలి మీదనుంచి వెళ్లిపోయింది. "అబ్బా" అంటూ కదలబోయేసరికి మంచం పక్కనున్న సెలైన్ బాటిలు ఊగింది.

"లేవకండి. లేవకండి."

సుధ కళ్లు ఎర్రబడి ఉన్నాయి. ఏడ్చి ఏడ్చి ఉబ్బి ఉన్నాయి. కల గుర్తుకొచ్చింది. నీరసంగా నవ్వేను. "నీకో శుభవార్తోయ్, ఇంకెప్పుడూ పూజలూ పునస్కారాలని నిన్ను బాధపెట్టను." అన్నాను ఆమె ముఖంపై చిరునవ్వుకై వెదుకుతూ.

"ఛ,ఛ. అవేం మాటలండీ. నాకు బుద్ధి వచ్చింది. వారం రోజులుగా మీరు కళ్లు తెరవకుండా పడి ఉంటే ఖంగారు పడిపోయా. భయం వేసి అందరు దేవుళ్లకూ మొక్కుకున్నా. రోజూ క్రమం తప్పకుండా మిమ్మల్ని గుడికి పంపి, మీ చేత అర్చనలు,అభిషేకాలు చేయిస్తానని..." అని ఏదో అంటోంది సుధ.

ఒక్కరోజుకే వారం రోజులు మంచం పడితే, ప్రతి రోజూ అంటే..? ఆలోచించే లోపునే నాకు మళ్లీ స్పృహ తప్పింది. ■